# సాక్షి జగిత్యాల

గురువారం । 5 । అక్టోబర్ । 2023






**బతుకమ్మ చీరలు వచ్చేశాయి**

బతుకమ్మ పండగ సందర్భంగా ప్రభుత్వం మహిళలకు చీరలు పంపిణీ చేస్తోంది.

IIలో



**బీఆర్ఎస్, బీజేపీ తోడుదొంగలు**

బీఆర్ఎస్, బీజేపీ తోడుదొంగల పార్టీలని, రెండుకలిసి కాంగ్రెస్ గెలు పును అడ్డుకునే కుట్ర చేస్తున్నాయని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు.

IIలో

గరిష్టం/కనిష్టం
32.0/24.0

**వాతావరణం**

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఎండ తీవ్రత పెరిగే అవకాశం ఉంది.

## ఓటర్లు..31.12లక్షలు

### ఉమ్మడి జిల్లాలో మహిళలే ఎక్కువ

- ఐదేళ్ల కింద 13 నియోజకవర్గాల్లో 27.88 లక్షల మందే
- కొత్త ఓటర్ల సంఖ్య 3,24,198
- కరీంనగర్‌లో అత్యధికం, రామగుండంలో అత్యల్పం
- దరఖాస్తుకు ఇంకా గడువు ఉందన్న ఎన్నికల సంఘం





సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

త్వరలో జరగనున్న ఎన్నికలకు అధికార గణం సిద్ధమైంది. ఓటర్ల తుది జాబితాను ఎన్నికల సంఘం బుధవారం విడుదల చేసింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మొత్తం 31,12,283 మంది ఓటర్లు ఉన్నారని అధికారులు వెల్లడించారు. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో 27,88,085 మంది ఉండగా.. ఐదేళ్లకు 3,24,198 మంది కొత్త ఓటర్లు నమోదయ్యారు. వీరిలో అధిక శాతం యువతే. ఓటరు నమోదుపై ఎన్నికల సంఘం చేసిన ప్రచార కార్యక్రమాలు, ప్రధాన మీడియా, సోషల్ మీడియా ద్వారా చేసిన ప్రచారం ఇందుకు దోహదపడిందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. బీఎల్‌వోలకు ఇచ్చిన శిక్షణ, డబుల్ ఓట్ల ఏరివేత, మరణించినవారి ఓట్లు తొలగింపు, ఆరు కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న ఇళ్లలో కుటుంబాల ప్రత్యక్ష తనిఖీలు, నకిలీ ఓటర్ల వడపోత తదితరాల ఫలితంగా ఈసారి వీలైనంత వరకు దోషాలు లేని జాబితాను రూపొందించినట్లు తెలిపారు.

### ప్రతీ నియోజకవర్గంలో పెరిగిన సంఖ్య..

ప్రతీ నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య పెరిగింది. మొత్తం 13 నియోజకవర్గాల్లో సంఖ్యాపరంగా చూసినప్పుడు 3,41,913 మంది ఓటర్లతో కరీంనగర్ అగ్రస్థానంలో నిలవగా.. 2,14,974 ఓటర్లతో పెద్దపల్లి జిల్లా రామగుండం చివరి స్థానంలో నిలిచింది. కరీంనగర్ జిల్లాలో కొత్తగా 54,831 మంది నమోదయ్యారు. నగరంలో పెరిగిన సదుపాయాలు, వలసలు, విద్యాసంస్థలు, ఉమ్మడి జిల్లాలో రిటైరైన వారంతా ఇక్కడే స్థిరపడటం తదితరాలు ఇందుకు కారణమని అధికారులు అంటున్నారు. మిగిలిన 12 నియోజకవర్గాల్లోనూ వేలాదిగా ఓట్లు పెరగడం నేటితరంలో ఓటు చైతన్యంపై వచ్చిన మార్పుగా మరికొందరు అభిప్రాయపడుతున్నారు.

### పెరుగుదల ఇలా..

కోరుట్లలో 20,652, జగిత్యాలలో 24,021, ధర్మపురిలో 17,890, రామగుండంలో 25,882, మంథనిలో 23,591, పెద్దపల్లిలో 27,413, కరీంనగర్‌లో 54,831, చొప్పదండిలో 16,957, వేములవాడలో 25,451, సిరిసిల్లలో 22,408, మానకొండూర్‌లో 15,909, హుజూరాబాద్‌లో 35,181, హుస్నాబాద్‌లో 14,005 మంది ఓటర్లు పెరిగారు.

### సర్వీసు ఓటర్లు 1,594 మంది..

ఉమ్మడి జిల్లాలో నియోజవర్గాల వారీగా సర్వీసు ఓటర్లు.. కరీంనగర్‌లో 101, చొప్పదండిలో 192, మానకొండూరులో 128, హుజూరాబాద్‌లో 163, కోరుట్లలో 47, జగిత్యాలలో 43, ధర్మపురిలో 131, వేములవాడలో 52, సిరిసిల్లలో 106, రామగుండంలో 213, మంథనిలో 155, పెద్దపల్లిలో 263 మొత్తం1,594 మంది ఉన్నారు. వీరంతా సైన్యంలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిసున్నారు.

### దరఖాస్తు చేసుకోండి..

సెప్టెంబరు 19 వరకు కొత్త ఓటర్ల నమోదు, ఓటు బదిలీ, సవరణలకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఒకవేళ ఓటుపై అభ్యంతరాలు, ఇతర క్లెయిములు ఇంకా పరిష్కారానికి నోచుకోని వారి దరఖాస్తులు పరిష్కరిస్తారు. అలాగే, ఇంకా దరఖాస్తు చేసుకోని కొత్త పౌరులు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించింది. నామినేషన్‌కు ఆఖరు తేదీకి సరిగ్గా 10 రోజుల ముందు వరకు అవకాశం ఉంటుందని తెలిపింది. అన్ని రకాల దరఖాస్తులకు voters.eci.gov.in వెబ్‌సైట్‌లో లేదా ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ (వీహెచ్‌ఏ) లేదా బీఎల్వోను లేదా ఓటరు హెల్ప్‌లైన్ 1950లో సంప్రదించవచ్చు.

**నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు**

| నియోజకవర్గం | పురుషులు | స్త్రీలు | థర్డ్ జెండర్ | మొత్తం |
|---|---|---|---|---|
| కరీంనగర్ | 1,71,254 | 1,70,615 | 44 | 3,41,913 |
| చొప్పదండి | 1,11,197 | 1,18,141 | 08 | 2,29,346 |
| మానకొండూరు | 1,07,371 | 1,11,041 | 01 | 2,18,413 |
| హుజూరాబాద్ | 1,19,676 | 1,24,833 | 05 | 2,44,514 |
| జగిత్యాల | 1,09,300 | 1,17,315 | 20 | 2,26,635 |
| కోరుట్ల | 1,13,030 | 1,23,692 | 04 | 2,36,726 |
| ధర్మపురి | 1,09,963 | 1,14,622 | 06 | 2,24,591 |
| సిరిసిల్ల | 1,17,872 | 1,22,920 | 06 | 2,40,798 |
| వేములవాడ | 1,04,943 | 1,13,186 | 31 | 2,18,160 |
| పెద్దపల్లి | 1,23,768 | 1,25,555 | 09 | 2,49,332 |
| రామగుండం | 1,08,233 | 1,06,716 | 25 | 2,14,974 |
| మంథని | 1,13,828 | 1,16,458 | 20 | 2,30,306 |
| హుస్నాబాద్ | 1,17,165 | 1,19,406 | 04 | 2,36,575 |
| మొత్తం | 15,27,600 | 15,84,500 | 183 | 31,12,283 |

## న్యూస్‌రీల్

### అధికారులు అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న అదనపు కలెక్టర్

ధర్మపురి: రానున్న ఎన్నికలకు వివిధ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర ఆదేశించారు. ధర్మపురి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎన్నికల్లో చేపట్టే విధి, విధానాలపై అధికారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణచైతన్య, ఎంపీడీవో ప్రవీణ్ ఉన్నారు.

### తపాలా ఉద్యోగుల సమ్మె



సమ్మె చేస్తున్న ఉద్యోగులు

జగిత్యాలజోన్: జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట గ్రామీణ తపాలా ఉద్యోగులు బుధవారం సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. కమిలేష్ చంద్ర కమిటీ సిఫార్సులు అమలు చేసి, గ్రామీణ తపాలా ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. అలాగే ఉద్యోగులకు రూ.5లక్షల గ్రూపు ఇన్సూరెన్స్ సదుపాయాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. సీనియారిటీ ఇంక్రిమెంట్లు, పెన్షన్లు, పనిభారం 8 గంటలకు కుదించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం నాయకులు శ్రీనివాస్ రెడ్డి, విజేందర్‌రావు, సామ హేమేందర్ రెడ్డి, రమాపతి రావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

### సదరెం శిబిరాలు

జగిత్యాల: జిల్లాలోని దివ్యాంగులకు ఈ నెల జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సదరెం శిబిరాలు నిర్వహించనున్నట్లు సూపరింటెండెంట్ రాములు తెలిపారు. ఈనెల 6, 13, 18, 26న ఆర్థోపెడిక్, 20న ఎంఆర్ శిబిరాన్ని స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నిర్వహిస్తామని, 31న మాతాశిశు సంరక్షణ కేంద్రంలో నిర్వహిస్తామని, దివ్యాంగులు మీసేవలో చేసుకున్న స్లాట్ బుకింగ్ రశీదు, ఆధార్ కార్డు, ఇతర ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

### ఎస్సారెస్పీలోకి 14,268 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



నిండుకుండలా ఎస్సారెస్పీ

జగిత్యాలఅగ్రికల్చర్: శ్రీరాంసాగర్‌లోకి బుధవారం 14,268 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రస్తుతం ప్రాజెక్ట్ పూర్తిస్థాయిలో నిండటంతో వచ్చిన నీటిని కాలువల ద్వారా కిందకు వదులుతున్నారు. ఈ మేరకు కాకతీయ మెయిన్ కెనాల్‌కు 2500 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తికి 5 వేలు, లక్ష్మీకెనాల్‌కు 200, సరస్వతి కెనాల్‌కు 300, అలీసాగర్ గుత్పా ఎత్తిపోతల పథకానికి 270, వరదకాలువకు 5వేలు, మిషన్‌భగీరథ 152 క్యూసెక్కుల చొప్పున నీటిని వదులుతున్నారు.

### లింగ నిర్ధారణ చేస్తే చర్యలు



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో ఎస్.శ్రీనివాస్

మల్యాల: లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని, కఠిన చర్యలు ఉంటాయని డిప్యూటీ డీఎంహెచ్‌వో ఎస్.శ్రీనివాస్ అన్నారు. మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆయన లింగ నిర్ధారణ చట్టంపై ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లకు అవగాహన కల్పించారు. చట్టానికి విరుద్ధంగా లింగ నిర్ధారణ చేస్తే ఐదేళ్ల జైలు శిక్ష పడుతుందని, వైద్యుల లైసెన్స్ రద్దు చేస్తారని అన్నారు. లింగ నిర్ధారణకు సహకరించినా.. అబార్షన్‌కు సహకరించినా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యులు మౌనిక, డీఈఎంఓ రమణ, భూమేశ్వర్, పీహెచ్ఎస్. నాగలక్ష్మీ, సూపర్‌వైజర్ సునంద, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

మల్లాపూర్/రాయికల్: అంతకుముందు డిప్యూటీ డీఎంహెచ్‌వో మల్లాపూర్ మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం రాయికల్ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

## ప్రతి ఇంటికీ చేరుతున్న పథకాలు



లబ్ధిదారులకు గృహలక్ష్మి మంజూరు పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ వెల్లడి
- లక్ష్మీపూర్‌లో గృహలక్ష్మి మంజూరు పత్రాల పంపిణీ
- పాల్గొన్న ఎమ్మెల్సీ రమణ, జెడ్పీ చైర్‌పర్సన్ వసంత

జగిత్యాలరూరల్: రాష్ట్రప్రభుత్వం పేదలకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లతోపాటు ప్రతి పథకాన్ని అందిస్తోందని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ రమణ, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. బుధవారం జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్‌లో రూ.20కోట్లతో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు అందజేశారు. మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. రూ.20 లక్షలతో నిర్మిస్తున్న గ్రామపంచాయతీ భవనం, రూ.10 లక్షలతో నిర్మించే డ్రెయినేజీ, రూ.8 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రైతుబంధు, రైతుబీమా పథకాలతోపాటు పంటలకు గిట్టుబాటు ధర అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దేనని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వ్యవసాయానికి విధంగా 24 గంటల విద్యుత్ ఇస్తున్నారని వివరించారు. తొమ్మిదేళ్లలో చేసిన అభివృద్ధి కళ్లముందే కన్పిస్తోందన్నారు. ఎమ్మెల్సీ కవిత కృషితో ప్రపంచ వ్యాప్తంగా బతుకమ్మ పండగకు ఆదరణ వచ్చిందన్నారు. పసుపు బోర్డు ఎన్నికల జిమ్మిక్కు అని ఎద్దేవా చేశారు. లక్ష్మీపూర్‌లో సీడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుతో రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. అనంతరం యువకులకు క్రికెట్ కిట్, క్రీడా పరికరాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చెరుకు జాన్, ఎంపీటీసీ సునీత, సింగిల్ విండో చైర్మన్లు మహిపాల్‌రెడ్డి, సందీప్‌రావు, రైతుబంధు మండల కన్వీనర్ రవీందర్‌రెడ్డి, ఆత్మ చైర్మన్ రాజిరెడ్డి, ఎంపీడీవో రాజేశ్వరి, డీఈ మిలింద్, ఎంపీవో రవిబాబు, ఏఈ రాజమల్లయ్య పాల్గొన్నారు.

**పార్టీలో పలువురి చేరిక**

జగిత్యాల: రాష్ట్రప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ ఎల్.రమణ అన్నారు. జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యువత బీఆర్ఎస్‌లో చేరారు. శ్రీను, రాము, శంకర్ పాల్గొన్నారు. ముందుగా పట్టణంలోని అమీనాబాద్‌లో డీఎంఎఫ్‌టీ నిధులతో నిర్మించిన కమ్యునిటీ హాల్‌ను ప్రారంభించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కౌన్సిలర్ లత, ఆనందరావు, అబ్దుల్ ఖాదీర్ పాల్గొన్నారు.

## అంజన్న హుండీ ఆదాయం రూ.56 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

కొండగట్టు (చొప్పదండి): కొండగట్టు అంజన్న స్వామివారి ఆలయానికి హుండీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని బుధవారం దేవాదాయ శాఖ కరీంనగర్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ సమక్షంలో లెక్కించారు. 26రోజులకుగాను రూ.56,78,169 వచ్చింది. అలాగే 14 గ్రాముల మిశ్రమ బంగారం, 1.700 కిలోల వెండి, 15 విదేశీ కరెన్సీ వచ్చినట్లు ఆలయ వర్గాలు పేర్కొన్నాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో వెంకటేష్, ఏఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్లు శ్రీనివాసశర్మ, సునీల్, అధికారులు జమున, శ్రీనివాస్, ధర్మేందర్, సంపత్ పాల్గొన్నారు.

## సంక్షేమానికి పెద్దపీట

- మంత్రి కొప్పుల ఈశ్వర్
- బీఆర్ఎస్ పార్టీలో చేరికలు

గొల్లపల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కృషి చేస్తోందని, ఇందులో భాగంగానే జనాభాలో సగం మందికి పింఛన్లు పంపిణీ చేస్తోందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మండలంలోని చిల్వాకోడూర్ గ్రామంలో 77 మందికి కళ్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం కాంగ్రెస్ నుంచి పలువురు బీఆర్ఎస్‌లో చేరగా.. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీ సాధించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. ఇది శుభపరిణామమని అన్నారు. బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతూ తప్పుదోవ పట్టిస్తోందని విమర్శించారు. 60 ఏళ్ల పాలనలో కాంగ్రెస్ చేయని అభివృద్ధిని బీఆర్ఎస్ పదేళ్లలో చేసి చూపించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నక్క శంకర్, జెడ్పీటీసీ జలేందర్, వైస్ ఎంపీపీ ఆవుల సత్యం, పీఏసీఎస్ చైర్మన్ రాజసుమన్‌రావు, మాధవరావు, పార్టీ మండల అధ్యక్షుడు బొల్లం రమేశ్, సర్పంచ్ కందుకూరి పద్మావతి, ఎంపీటీసీ తదితరులు పాల్గొన్నారు.



చిల్వాకోడూర్‌లో కార్యకర్తలతో మంత్రి ఈశ్వర్

**కార్యకర్తలే పార్టీకి పునాది**

ధర్మపురి: కార్యకర్తలే బీఆర్ఎస్‌కు పునాది అని మంత్రి ఈశ్వర్ అన్నారు. ధర్మపురిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం మండలంలోని రామయ్యపల్లెకు చెందిన బోగ రమేశ్ ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్‌లో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. ఏఎస్సై రాజమల్లయ్య కుటుంబాన్ని పరామర్శించారు. డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేష్, నాయకులు సొల్ల భీమయ్య తదితరులున్నారు.

## అంగన్‌వాడీల సమ్మె విరమణ

- స్వీట్లు పంచుకున్న టీచర్లు, హెల్పర్లు
- ప్రభుత్వానికి కృతజ్ఞతలు

కోరుట్ల/మల్యాల/సారంగాపూర్: అంగన్వాడీ ఉద్యోగులు సమ్మె విరమించారు. వారి డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించడంతో బుధవారం నుంచి సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించారు. కోరుట్ల ఆర్డీవో కార్యాలయం ముందు టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఏఐటీయూసీ, అంగన్‌వాడీటీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్‌తో మంత్రులు హరీశ్‌రావు, సత్యవతిరాథోడ్, జగదీశ్వర్‌రెడ్డి చర్చలు జరిపారని, అవి సఫలం కావటంతో సమ్మె విరమిస్తున్నట్లు పేర్కొన్నారు. సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో కేక్ కట్ చేసి అధికారులకు స్వీట్లు పంచిపెట్టారు. మల్యాలలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీ యూ) జిల్లా అధ్యక్షురాలు రజిత ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు.



పట్టణంలో టపాసులు కాల్చుతున్న అంగన్వాడీలు

## చిగురించిన ‘పసుపు’ ఆశలు

- నిజామాబాద్‌లో ‘బోర్డు’ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం
- పసుపు పంటకు కొన్నాళ్లుగా లభించని మద్దతు
- క్వింటాల్‌కు రూ.6వేల నుంచి రూ.7వేలే..

జగిత్యాలఅగ్రికల్చర్: పసుపు.. దీనిని ఆహారపదార్థాల్లోనే కాకుండా చర్మ సౌందర్య సాధనాలు, పరిమళ ద్రవ్యాల తయారీలో వాడుతుంటారు. అందుకే దీనికి అంతర్జాతీయంగా డిమాండ్ ఉంటుంది. అయితే ఒకప్పుడు బంగారంతో పోటీపడిన పసుపు.. ఇప్పుడు చతికిల పడి రైతులకు పెట్టుబడి ఖర్చులు కూడా రావడం లేదు. ఈ క్రమంలో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తే మేలు జరుగుతుందని రైతులు అనేక ఉద్యమాలు చేశారు. ఈ మేరకు స్పందించిన కేంద్రప్రభుత్వం నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించింది. దీనికి కేంద్ర కేబినెట్ బుధవారం ఆమోదం కూడా తెలిపింది. దీంతో పసుపు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

**40 వేల నుంచి 20వేల ఎకరాలకు..**



జగిత్యాల జిల్లాలో సాగవుతున్న పసుపు పంట

జిల్లాలో ఒకప్పుడు 40వేల ఎకరాల్లో పసుపు సాగయ్యేది. కొన్నాళ్లుగా పంట క్వింటాల్‌కు రూ.5 వేల నుంచి రూ.6వేలు మించకపోవడం.. ఆ మొత్తం పెట్టుబడికి కూడా సరిపోకపోవడంతో సాగు విస్తీర్ణం తగ్గించారు. ప్రస్తుతం జిల్లాలో ఎక్కువగా మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, మేడిపల్లి, కథలాపూర్ మండలాల్లో పండిస్తారు. అది కూడా కేవలం 20వేల ఎకరాలు మాత్రమే. ఇక్కడి రైతులు డ్రిప్ ద్వారా సాగు చేయడం.. ఆధునిక యాజమాన్య పద్ధతులు పాటించడంతో ఎకరాకు 30 నుంచి 40 క్వింటాళ్ల వరకు దిగుబడి తీస్తారు. పసుపు 9 నెలల పంట కావడంతో రైతులు ఇంటి పంటగా భావించి, దాదాపు ఎకరాకు సేంద్రియ ఎరువుల పేరిట రూ.లక్షవరకు ఖర్చు చేస్తుంటారు.

**రైతులకు లాభం ఇలా..**

- పసుపు బోర్డు ఏర్పాటుతో ఉత్పత్తిని నేరుగా ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసే అవకాశం ఉంటుంది.
- తద్వారా రైతులకు మంచి ధర వస్తుంది.
- పంటను ప్రాసెసింగ్ చేసి ఉపఉత్పత్తులుగా తయారు చేయడం కూడా కలిసి వచ్చే అంశం.
- పంటకు మార్కెట్లో ధర లేనప్పుడు నేరుగా బోర్డు కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది.
- పంట నిల్వకు కోల్డ్‌స్టోరేజీ కూడా ఏర్పాటు చేయవచ్చు.
- శాస్త్రవేత్తలు పరిశోధనలు చేసి దిగుబడితోపాటు తెగుళ్లను తట్టుకునే రకాలను రూపొందించే అవకాశం ఉంటుంది.
- పైగా భూసార పరీక్షలకోసం ల్యాబ్‌లు ఏర్పాటు చేయవచ్చు.
- ఆధునిక యంత్రాలు, టెక్నాలజీని రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చే అవకాశముంటుంది.
- సబ్సిడీ ధరలకు పసుపు విత్తనం, ఆధునిక యంత్రాలు అందించవచ్చు.
- పంట సాగుపై గ్రామాల్లో రైతులకు అవగాహన సమావేశాలు నిర్వహించవచ్చు.
- బోర్డుకు కేంద్ర ప్రభుత్వం అత్యధికంగా నిధులు విడుదల చేసే అవకాశం ఉంటుంది.
- బోర్డులో వ్యవసాయ, ఉద్యాన, ఔషధ, వైద్య, ఆర్థికం వంటి పలు రంగాల ప్రముఖులు, అభ్యుదయ రైతులు పాలు పంచుకుంటారు.
- విత్తనం నాటినప్పటి నుంచి మార్కెట్‌కు తీసుకెళ్లే వరకూ పసుపు నాణ్యత వంటి విషయాలపై పసుపు బోర్డు దృష్టి పెట్టనుంది.
- పసుపు ప్రాసెసింగ్ పరిశ్రమలు అందుబాటులోకొస్తే యువతకు ఉపాధి లభిస్తుంది.

### కేబినెట్ ఆమోదం అభినందనీయం



పసుపు బోర్డు ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలుపడం అభినందనీయం. బోర్డుకు సంబంధించిన కార్యకలాపాలు ప్రారంభించాలి. పసుపు బోర్డుతో రైతులకు అనుకున్న ధర వస్తే సాగువిస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది.

– క్యాతం సాయిరెడ్డి, పసుపు రైతుల ఉద్యమ నాయకుడు, సింగరావుపేట

### ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలి



జిల్లాలో పసుపు పంటకు సంబంధించిన ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటు చేయాలి. పసుపు తవ్వే సమయానికి బోర్డు చర్యలు ప్రారంభించాలి. రైతులకు కనీసం క్వింటాల్‌కు రూ.15వేలకు తక్కువ కాకుండా మద్దతు ధర వస్తే రైతులు సంతోషిస్తారు.

– కొట్టాల మోహన్ రెడ్డి, పసుపు రైతుల ఉద్యమ నాయకుడు, లక్ష్మీపూర్

## క్లుప్తంగా

### న్యాయశాస్త్రంలో పోతారం వాసికి డాక్టరేట్


కట్కూరి శ్రీనివాస్

మల్యాల: మండలంలోని పోతారం గ్రామానికి చెందిన న్యాయశాస్త్ర పరిశోధకుడు కట్కూరి శ్రీనివాస్ 'సైబర్ సెక్యూరిటీ-సబైర్ ఫొరెనిక్స్' అంశంపై పరిశోధన చేసి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. కట్కూరి దేవమ్మ, నర్సయ్య కుమారుడు శ్రీనివాస్ స్థానిక నూకపల్లి జిల్లా పరిషత్‌లో పదో తరగతి, జగిత్యాలలోని ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాలలో ఇంటర్, ఉస్మానియా వర్సిటీ నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. న్యాయశాస్త్రంలో శ్రీనివాస్ డాక్టరేట్ సాధించడంపై స్థానికులు హర్షం ప్రకటించారు. తన డాక్టరేట్‌ను తన తండ్రికి అంకితమిస్తున్నట్లు శ్రీనివాస్ తెలిపారు.

### క్రీడాకారులు ఉన్నతస్థాయికి ఎదగాలి


పతకాలతో క్రీడాకారులు

జగిత్యాల: చిన్నతనం నుంచే క్రీడల్లో అభివృద్ధి సాధిస్తూ క్రీడాకారులు ఉన్నతస్థాయికి ఎదగాలని తైక్వాండో అసోసియేషన్ చైర్మన్ మంచాల కృష్ణ అన్నారు. జిల్లాకేంద్రంలో తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్స్ పోటీల్లో జగిత్యాలకు చెందిన విద్యార్థులు సిల్వర్ మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా వారిని అభినందిస్తూ మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సంతోష్, ఉపాధ్యక్షుడు డాక్టర్ భీమేశ్, శ్రీనివాస్, ప్రశాంత్, సోయబ్, గంగారాం పాల్గొన్నారు.

### ఆశావర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలి


ఆశావర్కర్లకు సంఘీభావం తెలుపుతున్న గోపాల్‌రెడ్డి

కథలాపూర్: ఆశా వర్కర్లకు ప్రభుత్వం ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. కథలాపూర్‌లో ఆశావర్కర్ల రిలే నిరాహార దీక్షకు బుధవారం సంఘీభావం తెలిపారు. ఆశావర్కర్లకు నెలకు రూ.18 వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని, అదనంగా చేయించుకున్న పనులకు డబ్బులు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. బీజేపీ నాయకులు బద్రి సత్యం, గాంధారి శ్రీనివాస్, తెడ్డు మహేశ్, వినోద్, సాయి తదితరులు పాల్గొన్నారు.

### మోసం చేసిన వ్యక్తిపై కేసు

మేడిపెల్లి: మోటర్ సైకిల్ లక్కీడ్రా స్కీం పేరుతో రైతులను మోసం చేసిన మెట్‌పెల్లి పట్టణానికి చెందిన గోనె ప్రతాప్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మంద చిరంజీవి తెలిపారు. తమను లక్కీడ్రా పేరిట మోసం చేశాడని భీమారం గ్రామానికి చెందిన చెక్కపెల్లి రఘు, దాసరి నాగరాజు ఫిర్యాదు మేరకు ప్రతాప్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపామని ఎస్సై తెలిపారు.

# బతుకమ్మ చీరలు వచ్చేశాయి

| జిల్లాలోని నియోజకవర్గాల వారీగా వచ్చిన చీరలు | |
|---|---|
| జగిత్యాల | 1,01,374 |
| ధర్మపురి | 85,576 |
| కోరుట్ల | 1,03,317 |
| వేములవాడ (మేడిపల్లి, కథలాపూర్) | 37,287 |
| చొప్పదండి (మల్యాల, కొడిమ్యాల) | 36,446 |


బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు

జగిత్యాల: బతుకమ్మ పండగ సందర్భంగా ప్రభుత్వం మహిళలకు చీరలు పంపిణీ చేస్తోంది. రేషన్‌కార్డు కలిగి ఉండి.. 18 ఏళ్లు నిండిన మహిళలకు చీరలు అందించనుంది. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా జిల్లాకు చేరిన 3,64,000 చీరలను గ్రామీణాభివృద్ధి, రెవెన్యూ, పౌరసరఫరాల శాఖల ఆధ్వర్యంలో బుధవారం నుంచి పంపిణీ చేస్తున్నారు. జగిత్యాలలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ రమణ, జెడ్పీ చైర్మన్ దావ వసంత పంపిణీ చేశారు.

**అర్హులందరికీ ఇళ్లు**

అర్హులందరికీ ఇళ్లు ఇస్తామని, ఎవరూ అధైర్యపడవద్దని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. స్థానిక బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. కేటీఆర్ సభను విజయవంతం చేసినందుకు ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో 3,722 డబుల్‌బెడ్‌రూం ఇళ్ల మంజూరు పత్రాలు ఇచ్చామని, మిగితావి కూడా త్వరలోనే ఇస్తామన్నారు. వారం రోజుల్లో లబ్ధిదారులు కరెంట్ కనెక్షన్ తీసుకోవచ్చన్నారు.

**ఆడబిడ్డల ఆత్మగౌరవం కోసమే..**

కోరుట్ల రూరల్: పేదింటి ఆడబిడ్డలు ఆత్మ గౌరవంతో ఉండేందుకే రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ చీరల పంపిణీ చేపట్టిందని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహిళలకు చీరలు అందించారు. అనంతరం క్రీడాకారులకు క్రీడా సామాగ్రి అందజేశారు. ఎంపీపీ తోట నారాయణ, జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, జిల్లా రైబసా అధ్యక్షుడు చీటి వెంకట్రావు, వైస్ ఎంపీపీ చీటి స్వరూపారాణి, దారిశెట్టి రాజేష్, ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాస్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


లక్ష్మీపూర్‌లో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

**చొప్పదండి ఎమ్మెల్యే రవిశంకర్..**

కొండగట్టు: కొడిమ్యాల మండలకేంద్రంలో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి క్రీడాపోటీలను చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రారంభించారు. గ్రామాల్లో క్రీడలను ప్రోత్సాహించేందుకు కిట్లు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మండలకేంద్రంలో మినీ స్టేడియం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పునుగోటి ప్రశాంతి, సర్పంచ్ ఏలేటి మమత, నాయకులు పునుగోటి కృష్ణారావు, మేనేని రాజనర్సింగరావు, ఏలేటి నర్సింహరెడ్డి, నజీర్, పులి వెంకటేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


కొడిమ్యాలలో బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

# రైతుల పోరాట ఫలితమే పసుపు బోర్డు

- కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి

మెట్‌పల్లిరూరల్: రైతుల పోరాటాలతోనే కేంద్రప్రభుత్వం పసుపు బోర్డు ఏర్పాటుకు ముందుకొచ్చిందని కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి అన్నారు. మెట్‌పల్లి మండలం బండలింగాపూర్‌లో బుధవారం పర్యటించారు. పసుపు పంటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పసుపు బోర్డు ఏర్పాటు నిర్ణయం బీజేపీ విజయం కాదన్నారు. బోర్డు ఏర్పాటును కాంగ్రెస్ పార్టీ స్వాగతిస్తుందని, అయితే హామీని వెంటనే అమలు చేయాలన్నారు. ఎన్నికల ముందు బోర్డు విషయాన్ని ముందుకు తెచ్చి లబ్ధిపొందేందుకు ఎంపీ అర్వింద్ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, కిసాన్ సెల్ కార్యదర్శి క్రాంతికుమార్, నాయకులు తిరుపతిరెడ్డి, సంతోష్‌రెడ్డి, ప్రవీణ్, సురేందర్ రెడ్డి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.


బండలింగాపూర్‌లో రైతులతో మాట్లాడుతున్న అన్వేష్‌రెడ్డి

# జేఎన్టీయూలో సద్దుమణిగిన వివాదం

- రాజీకొచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు
- హాస్టల్ నుంచి ఆరుగురు విద్యార్థుల సస్పెండ్

కొండగట్టు(చొప్పదండి): నాచుపల్లి జేఎన్టీయూలో థర్డియర్, ఫోర్తియర్ విద్యార్థుల మధ్య ఆదివారం చెలరేగిన ఘర్షణ మంగళవారం వెలుగుచూసిన విషయం తెల్సిందే. ఈ సంఘనలో కొందరు విద్యార్థులు గాయపడ్డారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం ప్రిన్సిపాల్ కామాక్షిప్రసాద్ దృష్టికి తీసుకొచ్చారు. బుధవారం ప్రిన్సిపాల్ ఇరువురి తల్లిదండ్రులను కళాశాలకు పిలిపించి మాట్లాడారు. ఘర్షణకు పాల్పడిన ఆరుగురు విద్యార్థులను కళాశాల కమిటీ ఆదేశాల మేరకు హాస్టల్ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. మరోమారు ఇలాంటి గొడవలకు ఆస్కారం లేకుండా కళాశాల యాజమాన్యం పకడ్బందీ చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు.

# సాధికారతతోనే సమస్యల పరిష్కారం

జగిత్యాల: మహిళలు సాధికారత కృషి చేయాలని జిల్లా కో-ఆర్డినేటర్ అశ్విని అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్థిక స్థిరత్వం లేని సమయంలో.. సంపూర్ణ అవగాహన రాకుండానే ప్రేమ వివాహాలు చేసుకోవడం ద్వారా భవిష్యత్‌లో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. బాల్య వివాహాలు, టీనేజ్ ప్రేమలతో ఏర్పడే కష్టాలపై వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అలియా మక్సూద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధ్యాపక బృందం

## రెండు ట్రాక్టర్లు పట్టివేత

కథలాపూర్: మండలంలోని ఇప్పపల్లి శివారులో ప్రభుత్వ భూమిని చదును చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఆర్ఐ నాగేశ్ బుధవారం తెలిపారు. గ్రామస్తుల సమాచారం మేరకు తహసీల్దార్ ఆదేశాలతో అక్కడకు చేరుకోగా.. రెండు ట్రాక్టర్లు చదును చేస్తూ కనిపించాయని, వాటిని తహసీల్దార్ కార్యాలయానికి తరలించామని ఆర్ఐ పేర్కొన్నారు.

## కట్నం కోసం వేధించిన భర్తపై కేసు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని కృష్ణానగర్ ప్రాంతానికి చెందిన తిప్పర్తి రమ్యకృష్ణను అదనపు కట్నం కోసం వేధించినందుకు ఆమె భర్త పవన్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై మన్మథరావు తెలిపారు. స్థానిక అంబేద్కర్‌కాలనీకి చెందిన తిప్పర్తి రమ్యకృష్ణను ఐదేళ్ల క్రితం కృష్ణానగర్‌కు చెందిన పవన్ కుమార్‌కు ఇచ్చి పెళ్లి చేశారు. ఆ సమయంలో రూ.2 లక్షల కట్నం, తులం బంగారం అప్పగించారు. కొద్దికాలంగా అదనంగా మరో రూ.2 లక్షల కట్నం కావాలంటూ రమ్యకృష్ణను పవన్‌కుమార్ శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. దీంతో బాధితురాలు బుధవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

## రైతు విజ్ఞానయాత్రకు తరలిన రైతులు


రైతువిజ్ఞాన యాత్రలో మెట్‌పల్లి మండల రైతులు

మెట్‌పల్లిరూరల్: మండలంలోని వివిధ గ్రామాల రైతులు విజ్ఞాన యాత్రకు తరలివెళ్లారు. ఉద్యానశాఖ, లోహియా ఆయిల్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ యాత్రకు బుధవారం జగ్గాసాగర్, ఆత్మకూర్, కోనరావుపేట, చౌలమద్ది, రాజేశ్వర్‌రావుపేట గ్రామాలకు చెందిన 36 మంది రైతులు భద్రాద్రికొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేటలోగల పామాయిల్ పరిశ్రమను సందర్శించారు. ఆయిల్‌పామ్ సాగు విధానం, ఆవశ్యకత, మార్కెటింగ్‌తో పాటు పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఈవో భూమేశ్వర్, లోహియా ఆయిల్ కంపెనీ సభ్యుడు రాహుల్, రైతులు పాల్గొన్నారు.

## అర్చకుని ఇంట్లో చోరీకి యత్నం

సారంగాపూర్: బీర్పూర్‌లోని శ్రీలక్ష్మీనృసింహాస్వామి ఆలయ అర్చకుడు వొద్దిపర్తి మధుకుమారాచార్యుల ఇంట్లో దొంగలు చోరీకి యత్నించారు. తుంగూర్ గ్రామానికి చెందిన మధుకుమార్ నృసింహస్వామి ఆలయంలో అర్చకుడు. తీర్థయాత్రల కోసం ఆయన కుటుంబసభ్యులతో కలిసి వారంక్రితం వెళ్లాడు. బుధవారం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి కనిపించాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా.. బీరువా, ఇతర తాళాలు పగులగొట్టి ఉన్నాయి. పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై గౌతంపవార్ ఆధ్వర్యంలో పోలీసులు చేరుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

మెట్‌పల్లిరూరల్: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మెట్‌పల్లి ఆర్డీవో మధు అన్నారు. తన కార్యాలయంలో మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ తహసీల్దార్లు, ఉద్యోగులతో బుధవారం సమావేశమయ్యారు. కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ప్రజలు అసౌకర్యానికి గురైతే కలెక్టర్ లేదా తన దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

# ఉద్యోగులకు మధ్యంతర భృతి శాతం పెంచాలి

జగిత్యాల: ఉద్యోగులకు మధ్యంతర భృతి ఐదుశాతం ప్రకటించడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారని టీఎన్జీవో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోగ శశిధర్, నాగేందర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం మరోసారి పునరాలోచించి మధ్యంతర భృతి శాతాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వేతన సవరణకు ప్రభుత్వం కమిటీని నియమించడంపై హర్షం వ్యక్తం చేశారు. నాయకులు సాహిద్‌బాబు, రాజశేఖర్, మధుకర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీఎన్జీవో నాయకులు

# రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న రెడ్డి సంఘం నాయకులు

- ఆత్మీయ సమ్మేళనానికి తరలిరండి
- రెడ్డి ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల భూమారెడ్డి

మల్యాల: రూ.5వేల కోట్లతో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 5న మేడిపల్లిలో నిర్వహించే రెడ్ల ఆత్మీయ సమ్మేళనానికి వేలాదిగా తరలిరావాలని నేరేళ్ల భూమారెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని రెడ్డి సంఘం భవనంలో బుధవారం రెడ్డి ఆత్మీయ సమ్మేళన సభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. అర్హులైన పేద రెడ్డి సామాజికవర్గ విద్యార్థులకు విదేశీ విద్య కోసం రూ.25లక్షల ఆర్థిక సాయం అందించాలని, ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని కోరారు. ప్రతి రైతుకూ రూ.5లక్షల వరకు ఆరోగ్యభద్రత కార్డులు ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో ముత్యంపేట సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి, మల్యాల ప్యాక్స్ డైరెక్టర్ సంత ప్రకాశ్‌రెడ్డి, రెడ్డి సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# బీఆర్‌ఎస్, బీజేపీ తోడుదొంగలు

- రెండు పార్టీలు కలిసి కాంగ్రెస్‌ను అడ్డుకునే కుట్ర
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి


మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: బీఆర్‌ఎస్, బీజేపీ తోడుదొంగల పార్టీలని, రెండుకలిసి రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపును అడ్డుకునే కుట్ర చేస్తున్నాయని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. మంత్రి కేటీఆర్ జగిత్యాల పర్యటనలో యావర్‌రోడ్డు విస్తరణకు హామీ ఇస్తారని ప్రజలు భావించినా దానిని గాలికొదిలేశారని విమర్శించారు. యావర్‌రోడ్డును వంద ఫీట్లకు విస్తరించాలని డిమాండ్ చేశారు. కేటీఆర్‌ను సీఎం చేసేందుకు కేసీఆర్ తనను కలిశారన్న మోదీ వ్యాఖ్యలు వారిద్దరూ కలిసే ఉన్నారనడానికి నిదర్శనమన్నారు. దేశంలో నీతి నియమం లేని నాయకులు మోదీ, కేసీఆర్‌లేనన్నారు. సమాచార హక్కు చట్టం, ఉపాధి హామీ, అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించిన ఘనత కాంగ్రెస్‌దన్నారు. నాయకులు గిరి నాగభూషణం, బండ శంకర్, విజయలక్ష్మి, దుర్గయ్య, గాజుల రాజేందర్, జున్ను రాజేందర్, జగదీశ్వర్, చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

**సమస్యల పరిష్కారానికి అండగా నిలవండి**

తమ సమస్యల పరిష్కారంలో అండగా నిలవాలని ఆశావర్కర్లు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఇందిరాభవన్‌లో ఎమ్మెల్సీని కలిసి వినతిపత్రం అందజేశారు.

**ధర్మపురిలో కాంగ్రెస్ చేసిన అభివృద్ధే..**

ధర్మపురి: ధర్మపురి నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో చేపట్టిన అభివృద్ధి తప్ప.. బీఆర్‌ఎస్ కొత్తగా చేసింది ఏమీ లేదని జీవన్‌రెడ్డి అన్నారు. పట్టణంలో డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి గడపగడపకూ కాంగ్రెస్ ప్రచారం చేపట్టారు. శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయం ముందు కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాల బ్రోచర్లను ఆవిష్కరించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ఉచిత విద్యుత్‌పై తొలిసంతకం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ధర్మపురిలో మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్‌రావు చేసిన పనులే ఉన్నాయని పేర్కొన్నారు. పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, నాయకులు ఎస్.దినేష్, వేముల రాజు, సింహరాజు ప్రసాద్, వివిధ మండలాలకు చెందిన సర్పంచులు, మండల శాఖ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులున్నారు.

# పాఠశాల సమీపంలో క్షుద్రపూజలు

- సగానికి తగ్గిన విద్యార్థుల హాజరు శాతం

మల్యాల(చొప్పదండి): మండలంలోని రాజారం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల సమీపంలో కొందరు క్షుద్రపూజలు చేయడంతో పిల్లలు భయాందోళన గురయ్యారు. పోతారం వెళ్లే మూలమలుపు వద్ద కొబ్బరికాయలు కొట్టి, గుమ్మడికాయ, పసుపు, కుంకుమ చల్లారు. బుధవారం ఎప్పటిలాగే పిల్లలు పాఠశాలకు వెళ్తుండగా అది గమనించి న చిన్నారులు భయపడ్డారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు తమ పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లారు. కొంతమంది పిల్లలను స్కూల్‌కు పంపలేదు. గ్రామ సర్పంచ్ ఎడిపెల్లి సుగుణ సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. రోడ్డుపై ఉన్న క్షుద్రపూజలకు సంబంధించిన పదార్థాలను తొలగించారు. రాజారం పాఠశాలలో మొత్తం 92మంది విద్యార్థులకు కేవలం 47మంది మాత్రమే వచ్చినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఒకటో తరగతిలో ఒకరు, రెండో తరగతిలో నలుగురు, మూడో తరగతిలో ఏడుగురు, నాలుగో తరగతిలో ఐదుగురు, ఆరో తరగతిలో ఐదుగురు, ఏడో తరగతిలో ఏడుగురు, ఎనిమిదో తరగతిలో పన్నెండు మంది విద్యార్థులు హాజరైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు.


పాఠశాల సమీపంలో మూలమలుపు వద్ద క్షుద్ర పూజలు

# టాస్క్ పేరిట రూ.3.17 లక్షలు స్వాహా

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని వాణీనగర్‌కు చెందిన యువకుడు వెంకటసాయి నుంచి సైబర్ నేరగాళ్లు టాస్క్ పేరిట దశలవారీగా రూ.3.17 లక్షలు కాజేశారు. వెంకటసాయికి గతనెల 23న వాట్సాప్‌కు మిస్డ్ కాల్ వచ్చింది. తిరిగి కాల్ చేయగా వాట్సాప్ ద్వారా బాధితుడికి టాస్క్ చేస్తే డబ్బులు వస్తాయని నమ్మించారు. మొదటి విడతగా రూ.50తో టాస్క్ చేయగా తర్వాత రూ.2 వేలు, రూ.5 వేలు చెల్లిస్తే డబ్బులు తమ ఖాతాలో జమచేస్తామని నమ్మించారు. అలా బాధితున్ని నమ్మించి ఏడు దఫాల్లో రూ.3.17లక్షలను సైబర్ నేరగాళ్లు కాజేశారు. తర్వాత వారి నుంచి స్పందన లేకపోవడంతో బాధితుడు బుధవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై మన్మథరావు తెలిపారు.

# 'ఉపాధి'లో అక్రమాలు

- సామాజిక తనిఖీలో వెల్లడి
- ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.39వేల జరిమానా
- అధికారుల తీరుపై ప్రజల అసంతృప్తి
- పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని విన్నపం


కూలీ అందలేదని అధికారులకు మొరపెట్టుకుంటున్న వికలాంగుడు

వెల్గటూర్: మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులపై అధికారులు స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో బుధవారం 13వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. 1 ఆగస్టు 2021 నుంచి 31 మార్చి 2023 వరకు మండలంలో చేపట్టిన వివిధ పనులపై తనిఖీ బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలించిన నివేదికలను అధికారులకు సమర్పించారు. మండలంవ్యాప్తంగా 9.67 కోట్ల పనులు జరిగాయి. ఇందులో మస్టర్లలో పొరపాట్లు, హాజరు పట్టికలో దిద్దుబాట్లు, కొలతల్లో తేడాలు వచ్చినట్లు గుర్తించి ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.39వేల జరిమానా విధించారు. అయితే అధికారులు పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహించలేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. స్తంభంపల్లికి చెందిన లవంగం రాజయ్య అనే వికలాంగుడు తాను చేసిన పనికి పూర్తి స్థాయిలో కూలీ అందలేదని, రెండేళ్లుగా అధికారుల చుట్టూ తిరిగి వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేకుండాపోయిందని, అధికారులు సిబ్బందిపై చర్యలు తీసుకోకుండా పోస్టల్ డిపార్ట్‌మెంట్ తప్పిదం అంటూ తప్పించుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. కూలీ ఇవ్వలేదని అడిగినందుకు తనకు పని కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. సామాజిక తనిఖీ బృందాలు పూర్తిస్థాయిలో విచారణ చేస్తే ఇలాంటి అక్రమాలు వెలుగులోకి వస్తాయని బాధితులు అంటున్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో నరేష్ కుమార్, ఏపీడీ శివాజీ, అంబుడ్స్‌మెన్ కృష్ణారెడ్డి, ఎస్ఆర్పీ తిరుపతి, ఏపీవో దేవేందర్‌రెడ్డి, క్వాలిటీ కంట్రోల్ అధికారులు, ఎంపీడీవో సంజీవరావు, ఏపీవో అనిల్, సర్పంచులు, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో రాష్ట్రం దూసుకెళ్తోంది


కోమటికొండాపూర్‌లో పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

- కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

ఇబ్రహీంపట్నం: రాష్ట్రం అభివృద్ధిలో దుసుకెళ్తోందని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని కోమటికొండాపూర్‌లో రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనం, పాఠశాలలో అదనపు తరగతి గదులను ప్రారంభించారు. సీఎం కేసీఆర్ చొరవతో రైతులకు 24 గంటల విద్యుత్ అందుతోందని, రైతులు పంటలు పండించుకుంటున్నారని తెలిపారు. ఎంపీపీ జాజాల భీమేశ్వరి, ఎంపీడీవో ప్రభు, వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు ఏలేటి చిన్నారెడ్డి, సర్పంచు శ్రీనివాస్, ఎంపీటీసీ జైలేశ్, నాయకులు ఎలాల దశరథ్‌రెడ్డి, జేడీ సుమన్, జాజాల జగన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

**మరోసారి అవకాశం ఇవ్వండి**

మెట్‌పల్లి: నియోజకవర్గంలో అభివృద్ధిని చూసి వచ్చే ఎన్నికల్లో మరోసారి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు. పట్టణంలో ఆసరా లబ్ధిదారులకు గుర్తింపు కార్డులు, బతుకమ్మ చీరెలు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో చైర్‌పర్సన్ రాణవేని సుజాత, వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రావు, కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.